క్లుప్తంగా

వృద్ధాశ్రమాలకు సామగ్రి వితరణ



గృహోపకరణాలను అందజేస్తున్న డీజీఎం లేఖామీనన్

కర్నూలు(అగ్రికల్చర్): బి.తాండ్రపాడులోని సెరుడ్స్ వృద్ధ, అనాథాశ్రమాలకు ఎస్‌బీఐ కర్నూలు పరిపాలన కార్యాలయం ఆధ్వర్యంలో రూ.2 లక్షల విలువ చేసే గృహోపకరణాలను డీజీఎం లేఖామీనన్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐ అన్ని వర్గాల ప్రజలకు తక్కువ వడ్డీతో రుణ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం సత్యనారాయణస్వామి, చీఫ్ మేనేజర్లు సీవీఆర్ ప్రసాద్, జొన్నా సురేష్, విశ్వభాణు, డిప్యూటీ మేనేజర్ సురేష్, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆర్‌యూ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలి

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమన్న షాబీర్‌బాషా డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకుల ముఖ్య సమావేశంలో వారు మాట్లాడుతూ వర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను భర్తీ చేయాలన్నారు. జిల్లాలో తీవ్ర కరువు నెలకొన్న నేపథ్యంలో విద్యార్థులకు సంబంధించిన అన్ని రకాల ఫీజును రద్దు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అశోక్, రాజశేఖర్, శివరాజు, రవి, విష్ణు, రామాంజి పాల్గొన్నారు.

రజక ఆత్మగౌరవ సభకు తరలిరండి

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నవంబర్ 26న గుంటూరు నాగార్జున విశ్వ విద్యాలయం మైదానంలో జరగనున్న రజక ఆత్మగౌరవ సభకు తరలి రావాలని రజక సంఘాల నేతలు కోరారు. బుధవారం స్థానిక బీసీ భవన్ ఆవరణలోని మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల ముందు సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. రజక సంఘాల నాయకులు వేంపెంట రాంబాబు, వాడాల నాగరాజు, బొట్టు మధు, సీపీ వెంకటేష్, గోల్డ్ శ్రీను, జగదీష్‌బాబు, భారతీ తపాల్గొన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని, రక్షణ చట్టం ఏర్పాటు చేయాలనే డిమాండ్లపై నిర్వహిస్తున్న సభకు రజకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఎం, సీపీఐ, ఏపీ రైతు సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు వస్తున్న నేపథ్యంలో కమ్యూనిస్ట్ పార్టీల నాయకులు జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కరువుగా ప్రకటించి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. బుధవారం సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ లేఖ పత్రాలను ఆ పార్టీ నాయకులు కె.జగన్నాథం, పి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేశారు. గతంలో ఎన్నాడూ లేని విధంగా జిల్లాలో కరువునెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ప్రకటలను విడుదల చేశారు. తాగు, సాగునీటి ప్రాజెక్టులను నిర్మించాలని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధులను విడుదల చేయాలని వారు కోరారు.

30 నుంచి ప్రజా రక్షణ భేరీ యాత్ర

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం నిధులు కేటాయించాని కోరుతూ ఈనెల 30 నుంచి ప్రజా రక్షణ భేరీ యాత్ర ఆదోనిలో ప్రారంభిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ తెలిపారు. బుధవారం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పార్టీ ఓల్డ్ సిటీ నగర విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్రలో ప్రత్యామ్నాయ రాజకీయాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అలాగే జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు విజయ్,ఎండీ షరీఫ్, అబ్దుల్లా, రామకృష్ణ, రాజగోపాల్, సుబ్బయ్య, పార్వతయ్య పాల్గొన్నారు.

21, 31 జీఓలను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఆటో కార్మికులకు శాపంగా మారిన 21, 31 జీఓలను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు పోలీసుల వేధింపులు.. మరోవైపు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆర్‌టీఏ అధికారులు ఆపీ చలాన్లు రాస్తుండడంతో ఆటో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేష్, జి.చంద్రశేఖర్, ఆర్.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరానికి నిధుల వరద

- 104 అభివృద్ధి పనులకు రూ.7.20 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్

కర్నూలు (టౌన్): నగరంలోని ప్రతి కాలనీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. అందులో భాగంగా 104 అభివృద్ధి పనులకు రూ.7.20 కోట్లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. నగర పాలక సంస్థ పరిధిలో కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వారి వారి పరిధిలోని వార్డుల్లో పర్యటించారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే పలు కాలనీలలో అభివృద్ధి పనులను గుర్తించడం, టెండర్ ద్వారా పనులు అప్పగించడం, నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయడం జరుగుతోంది. మొదటి విడత కింద రూ.1.13 కోట్లు, రెండవ దశ కింద రూ.4.59 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఈ నిధులకు సంబంధించి రూ.5 కోట్లు విడుదల కావాల్సి ఉంది. తాజాగా మరోసారి గడప గడపకు మన ప్రభుత్వం కింద జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అభివృద్ధి పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

శివారు కాలనీలలో మౌలిక వసతులు..

తాజాగా మంజూరైన నిధులతో శివారు కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు శ్రీకారం చుట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత 2019–2020 సంవత్సరాల మధ్య నగరపాలక సంస్థ పరిధిలో పెద్దపాడు, పందిపాడు, లక్ష్మీపురం గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. కర్నూలు నగర పరిధిని 67 చదరపు కిలో మీటర్ల నుంచి 110 చదరపు కిలో మీటర్ల పరిధికి విస్తరించారు. విలీన గ్రామాల్లో కల్వర్టులు, మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, డబ్ల్యూబీఎం రోడ్లు, కంకర రోడ్లు, తాగునీటి పైపులైన్ వంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.



పెద్ద పడఖాన కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో కొన్ని..

- ఆరోరా నగర్‌లో రూ.5 లక్షలతో 450 ఎంఎం సీసీ డ్రైన్ నిర్మాణం
- అశోక్‌న గర్‌లో బల్వారి అపార్టుమెంట్ నుంచి లేబర్ కాలనీ వరకు రూ.10 లక్షలతో 380 ఎంఎం సీసీ డ్రైన్
- అశోక్ నగర్‌లోని అజర్ కిరాణం ఇంటి నుంచి ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్ వరకు రూ.25 లక్షలతో 600 ఎంఎం సీసీ డ్రైన్
- బడిబీత్ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్
- బండిమెట్టలోని అలీషేర్‌బాగ్ వద్ద రూ.10 లక్షలతో 110ఎంఎం పైప్‌లైన్
- బి.క్యాంపు కాలనీలో సాయిరామ్ షాపు వద్ద రూ.5 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం
- బిర్లా కాంపౌండ్‌లో రూ.5 లక్షలతో సీసీ డ్రైన్
- చిదంబరరావు వీధిలో రూ.10 లక్షలతో బోర్ వెల్, మోటార్ ఏర్పాటు, సీసీ డ్రైన్‌కు మరమ్మతులు
- డాక్టర్స్ కాలనీలోని కిసాన్ నగర్‌లో రూ.5 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం
- రూ.5 లక్షలతో ఎఫ్‌సీఐ కాలనీలో సీసీ రోడ్డు

అభివృద్ధి పనులు చేపడతాం



గడప గడపకు మన ప్రభుత్వం కింద ప్రభుత్వం క్రమంగా నిధులు మంజూరు చేస్తోంది. ప్రజా ప్రతినిధులు గుర్తించిన సమస్యలు, శివారు కాలనీల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరో రూ.7.20 కోట్లు విడుదల చేసింది. పరిపాలన అనుమతులు మంజూరు కావడంతో 104 అభివృద్ధి పనులకు వారం రోజుల వ్యవధిలో టెండర్ ప్రక్రియ చేపట్టి పనులు కూడా త్వరలో ప్రారంభిస్తాం.

– శేషసాయి, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

సీఎం పర్యటనలో 38 మంది విద్యుత్ ఉద్యోగులు

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో 38 మంది విద్యుత్ అధికారులకు వివిధ ప్రాంతాల్లో బాధ్యతలు అప్పగించినట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం సీఎం ఎమ్మిగనూరు పర్యటన నేపథ్యంలో తనతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సుధాకర్‌కుమార్, బబ్రువాహన, మురళీధరబాబు, ఓబులేసు, డీఈఈలు మోహన్‌రావు, వై సుబ్బన్న, ఎస్ మక్బూల్, రాఘవేంద్రరావు, రామకృష్ణ, స్వరూప్, ఏఈలు కృష్ణమూర్తి రావు, సుధాకర్ రావు, వీరేష్, రవీంద్ర, గోవింద్, గురుమూర్తితో పాటు 21 మంది లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మ్యాన్లు, జూనియర్ లైన్‌మ్యాన్లు ఉన్నట్లు పేర్కొన్నారు.వీరు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు, ఎమ్మిగనూరు హెలిప్యాడ్, మీటింగ్ హాల్ వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తారన్నారు.అత్యవర సరిస్థితుల కారణంగా కరెంట్ పోతే ప్రత్యామ్నాయంగా విద్యుత్ అందించేందుకు జనరేటర్లు సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.

నోటిఫికేషన్లు విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం డీఎస్సీ, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల నోటిఫికేషన్లు విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేస్ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీసీ కులగణన వైఎస్ జగన్‌తోనే సాధ్యం



వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీసీ సంఘాల నేతలు

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం

కర్నూలు(అర్బన్): ఎన్నో ఏళ్లుగా బీసీలు ఎదురు చూస్తున్న కుల గణన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని బీసీ నేతలు అన్నారు. బీసీ కులగణన చేపట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిన నేపథ్యంలో బుధవారం బీసీ భవన్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి బీసీ సంఘాల నేతలు పాలాభిషేకం చేశారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ ఆచారి, బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మికాంతయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, సీనియర్ బీసీ నాయకులు గడ్డం రామక్రిష్ణ, మహమ్మద్ ఆలీఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అయ్యన్నయాదవ్, రసూల్‌ఖాన్, మధు, భాస్కర్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన



చిన్నారికి చుక్కల మందు వేస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, ఇందుకు అనుగుణంగా సేవలందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ వైద్యసిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన డాక్టర్స్ కాలనీలోని యూపీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. హెల్ప్‌డెస్క్, కేస్‌షీట్స్, ల్యాబ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ కౌంటర్లు, మందుల కౌంటర్లు, స్పాట్ సర్వే కౌంటర్‌లను పరిశీలించారు. అవసరమైన వారికి ఉన్నత వైద్యసేవల కోసం రెఫర్ చేయాలని సూచించారు. అనంతరం ఇల్లూరు నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని రామలింగేశ్వరనగర్‌లో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. పలువురు తల్లులతో మాట్లాడి వారి పిల్లలకు టీకాలు వేశారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు.

ఖర్చు లేకుండా వైద్య సేవలు



చిన్నారులు, ఆరోగ్య సిబ్బందితో ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ హేమలత

కర్నూలు సిటీ: రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నామని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ఆఫీసర్ డాక్టర్ హేమలత అన్నారు. బుధవారం కర్నూలు మండలం పసుపుల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులు, రక్తపోటు, షుగర్, హిమోగ్లోబిన్, మూత్ర పరీక్ష, గర్భిణులు, బాలింతలు, బరువు లేని పిల్లలకు పరీక్షలు నిర్వహించి, వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయమాధురి, హేమలత, ఎంపీహెచ్‌ఈఓ వెంకటరమణ పాల్గొన్నారు.

షేక్ జాఫ్రిన్‌కు గ్రూప్–1 ఉద్యోగం



మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలుపుతున్న షేక్ జాఫ్రిన్ కుటుంబ సభ్యులు

కర్నూలు (టౌన్): ఇండియన్ డెఫ్ టెన్నిస్ క్రీడాకారిణి షేక్ జాఫ్రిన్‌కు ప్రభుత్వం గ్రూప్–1 స్థాయి ఉద్యోగం కేటాయించింది. 2017, 2021 డెఫ్ ఒలింపిక్స్‌లో ఆమె కాంస్య పతకాలు ఆమె సాధించింది. జాతీయస్థాయి అవార్డు అందుకుంది. ఇటీవల షేక్ జాఫ్రిన్ కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. జాతీయస్థాయిలో టెన్నిస్ క్రీడాకారిణిగా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని భారతదేశానికి పతకాలు సాధించిన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లో స్పందించిన సీఎం ఉద్యోగం, ఇంటి స్థలం కేటాయించాలని సీఎంఓ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా షేక్ జాఫ్రిన్‌కు అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ రిజిస్ట్రార్ ఉద్యోగం, కర్నూలు నగరంలో పది సెంట్ల స్థలం కేటాయించారు. దీంతో బుధవారం బేతంచర్లలోని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని షేక్ జాఫ్రిన్ కుటుంబం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

హత్య కేసులో ఏడుగురికి జైలు

కర్నూలు(లీగల్): హత్య కేసులో ఏడుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.శ్రీనివాసకుమార్ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు.. బేతంచెర్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన స్వాములును అదే గ్రామానికి చెందిన తలారి పెద్ద మద్దిలేటి, చిన్న మద్దిలేటి, తలారి తిమ్మయ్య, తలారి చంద్ర, తలారి మద్దిలేటి, తలారి రామానాయుడు, తలారి మద్దిలేటి, తలారి నగేష్ పొలం తగాదాలో 2014 జనవరి 8న దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందాడు. మృతుడి కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో నిందితులపై నేరం రుజువుకావడంతో మొదటి ముగ్గురికి ఐదేళ్ల జైలు, రూ.11 వేల జరిమానా, మిగతా నలుగురికి మూడేళ్ల జైలు, రూ.4 వేల జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.శ్రీనివాసకుమార్ తీర్పు వెలువరించారు.

డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్ష ఫలితాలు విడుదల

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదవ సెమిస్టర్‌లో 291 మంది విద్యార్థులకు గానూ 283, ఆరో సెమిస్టర్‌లో 273 మంది విద్యార్థులకు గానూ 268 మంది విద్యార్థులు పాసయ్యారన్నారు. ఫలితాల కోసం https://-rayalaseemauniversity.ac.in లో చూడాలని విద్యార్థులకు సూచించారు.

లక్కిరెడ్డి డెంటల్ హాస్పిటల్‌కు అవార్డు

కర్నూలు (హాస్పిటల్): స్థానిక ఎన్ఆర్ పేటలోని లక్కిరెడ్డి సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్‌కు ఢిల్లీ ఫైవ్ బెస్ట్ సిటీ సంస్థ ఎక్సలెన్స్ అవార్డు ప్రకటించింది. దేశంలో ఏటా ఐదు నగరాల్లోని ఆసుపత్రులకు ఇచ్చే ఈ అవార్డు ఈసారి లక్కిరెడ్డి డెంటల్ హాస్పిటల్‌కు దక్కింది. 25 ఏళ్లుగా అందించిన సేవలకు గానూ ఈ అవార్డు వచ్చినట్లు ఆసుపత్రి అధినేత డాక్టర్ లక్కిరెడ్డి అమరసింహారెడ్డి బుధవారం తెలిపారు.

నేటి నుంచి పౌరాణిక నాటక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అశోక్ నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు సంస్థ అధ్యక్షులు మనోహర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు, మయసభ, శ్రీకృష్ణ సంగు సీను, సత్యహరిశ్చంద్ర, వారణాసి, కాటి సీను ప్రదర్శనలు ఉంటాయన్నారు.

22న ఉచిత వైద్య శిబిరం


కర్నూలు(సెంట్రల్): ఈనెల 22న సుందరయ్య స్ఫూర్తి కేంద్రం– ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ కె.ప్రభాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూర్ఛ, బీపీ, షుగర్, పక్షవాతం వ్యాధులకు వైద్యం అందించడంతోపాటు రెండు నెలలకు మందులను ఉచితంగా అందజేస్తామని, ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి గిప్సన్ చర్చి సంఘ వార్షికోత్సవాలు

కర్నూలు (టౌన్): స్థానిక గిప్సన్ సెంట్రల్ బాప్టిస్టు చర్చి సంఘ వార్షికోత్సవాలు ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకల కార్యదర్శి మాధవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న ఉదయం 10 గంటలకు చర్చి సండేస్కూల్ పిల్లలచే బైబిల్ ఫెయిర్ ఉంటుందన్నారు. అలాగే 19న విశాఖపట్టణానికి చెందిన పవర్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ పాస్టర్ భోగి శాంతరావు, 20, 21 తేదీల్లో బెంగళూరుకు చెందిన అంతర్జాతీయ స్పీకర్ రెవరెండ్ కె.ఎడ్వర్డ్ విలియమ్స్, 22న కడపకు చెందిన కృపా మినిస్ట్రీస్ టీవీ స్పీకర్ డాక్టర్ టీడీ ప్రసన్నకుమార్ దైవ సందేశం ఇస్తారన్నారు.

29న విజయవాడలో ధర్నా

కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 29న విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మారియానందం సూచించారు. బుధవారం సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. జీపీఎస్‌ను ఏపీటీఎఫ్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదన్నారు. 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడం వల్ల ప్రాథమిక విద్య అస్తవ్యస్తంగా మారిందన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో పదోన్నతులు పొందిన ఏపీటీఎఫ్ సభ్యులను సన్మానించారు. సమావేశంలో సంఘం నాయకులు రామకృష్ణయ్య, మద్దిలేటి, స్వామినాథన్, పీవీ శేషయ్య, రాంగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



లలితా పీఠంలో లలితా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు



అమ్మవారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

మమ్మేలవమ్మా.. మహాలక్ష్మీ!

కర్నూలు కల్చరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలో నాలుగవ రోజు బుధవారం అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, నవరాత్రుల సందేశాలు, ప్రవచనాలు జరిగాయి. వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో లలితా త్రిపురసందరిగా, కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, గంగా భవాని ఆలయం, సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయంలో మహాలక్ష్మిగా, చిన్న అమ్మవారి శాలలో లలితా దేవిగా, నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో శాకాంబరిగా, వన్‌టౌన్ గీతా మందిరంలో సత్యనారాయణ స్వామిగా, చిత్తారి వీధి నిమిషాంబ దేవి ఆలయంలో లలితా దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చిన్మయమిషన్, బుధవారపేట, వన్‌టౌన్ కాళికాంబ దేవి ఆలయం, బండిమెట్ట అంబా భవాని ఆలయం, వన్‌టౌన్ కాళికాంబ ఆలయం, ఆరోరా నగర్ రాజరాజేశ్వరి దేవి ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.



గీతా మందిరంలో సత్యనారాయణ స్వామిగా..



సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయంలో..



చిన్న అమ్మవారి శాలలో లలితా దేవిగా..

చేపల వినియోగాన్ని పెంచుదాం

- గాయత్రీ ఎస్టేట్‌లో ఫిష్ ఆంధ్ర సూపర్ రెస్టారెంట్‌ను ప్రారంభించిన కలెక్టర్, ఎంపీ సంజీవ్‌కుమార్



ఫిష్ సూపర్ రెస్టారెంట్ ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(అగ్రికల్చర్): చేపల వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. గాయత్రీ ఎస్టేట్ మెయిన్ రోడ్డుపై ఫిష్ ఆంధ్ర లబ్ధిదారు ఎం.రేణుక ఏర్పాటు చేసిన ఫిష్ సూపర్ రెస్టారెంట్‌ను ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ్‌కుమార్, జేసీ నారపురెడ్డి మౌర్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డితో కలిసి ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద 60 శాతం సబ్సిడీతో మత్స్యశాఖ రేణుకకు ఫిష్ సూపర్ రెస్టారెంట్‌ను మంజూరు చేసిందన్నారు. అలాగే ఇప్పటికే జిల్లాలోఫిష్ ఆంధ్ర కింద 65 రిటైల్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. గాయత్రీ ఎస్టేట్ సూపర్ రెస్టారెంట్ మాదిరిగానే త్వరలో వెల్దుర్తిలో ప్రారంభిస్తామన్నారు. నన్నూరు టోల్‌ప్లాజా, ఎమ్మిగనూరుల్లో రూ.50 లక్షల యూనిట్ కాస్ట్ తో ఫిష్ లాంజ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపా రు. రెస్టారెంట్‌లో పరిశుభ్రత, చేపల వంటకాలలో నాణ్యత పాటించాలని, నిర్వాహకురాలికి సూచించారు. ఎంపీ డాక్టర్ సంజీవకుమార్ మాట్లాడుతూ చేపలు ఆరోగ్యానికి మంచివన్నారు. పలు రకాల పోషకాలు ఉంటాయని, డయబటీస్ రోగులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కూడా ఆహారంగా తీసుకోవచ్చన్నారు.కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ ఉప సంచాలకులు శ్యామల, కార్పొరేటర్లు సత్యనారాయణమ్మ, పద్మలత, మెప్మా పీడీ నాగశివలీల, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బుధవారపేట బ్రాంచ్ మేనేజర్ ఇంద్రాణి పాల్గొన్నారు.

వార్డు శానిటేషన్ కార్యదర్శిపై వేటు

కర్నూలు (టౌన్): నిధుల దుర్వినియోగానికి పాల్పడిన శానిటేషన్ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు పడింది. 14వ సచివాలయంలో వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంటల్ కార్యదర్శి సీహెచ్ అనంతస్వామి యూజర్ చార్జీల వసూళ్లలో రూ.28 వేలు దుర్వినియోగం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయంలో సస్పెండ్ చేస్తూ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్థానచలనం.. : నలుగురు వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్యదర్శులకు స్థానచలనం కల్పించారు. షేక్ నజీర్ బాషా (సచివాలయం 112), సుధాకర్‌రెడ్డి (సచివాలయం 113), రఘునాథ్ (సచివాలయం 34), సోమేశ్వరి (సచివాలయం 109)లకు స్థానచలనంతో పాటు ఖాళీగా ఉన్న సచివాలయ వార్డు వెల్ఫేర్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శి స్థానాల్లో నియమిస్తూ బుధవారం నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆక్రందన దీక్షలు జయప్రదం చేయండి

కర్నూలు సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక రూ.800 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 20, 21 తేదీల్లో చేపట్టనున్న ఆక్రందన దీక్షలను జయప్రదం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న సూచించారు. బుధవారం స్థానిక సలాం ఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆక్రందన దీక్షల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టులో జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో బకాయిలు సెప్టెంబరులో చెల్లిస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు దాని ఊసే లేదన్నారు. విధిలేని పరిస్థితుల్లో మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రెండు రోజుల పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో దీక్షలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు గోకారి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, శ్రీధర్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
MAHINDRA ALFA DX DIESEL
BSVI 2021 MODEL AP39 UA 8884
Cell : 99594 60083
62-65, 1st Floor, S V Complex,
R S Road, KURNOOL.